# దివ్యదీపకళిక

**ప్రాచీన గాథాలహరి**

పి. గణపతిశాస్త్రి

వివాహమహోత్సవ దివసం సమీపించిన కొద్దీ దేవసేనకు క్షణమొక యుగంగా గడిచింది. జసల్మియర్ యువరాజు విక్రమసింహుని సందర్శనం కోసం ఆమె అనుక్షణము తహతహ లాడింది. విక్రమసింహునికీ, దేవసేనకు వివాహం స్థిరపడి, ప్రధాన మహోత్సవం జరిగి అంతా ఒక పక్షం రోజులే అయింది. జాల్వారు రాజపురోహితులు "శుభస్యశీఘ్రం" అని వెంటనే వివాహముహూర్తం కూడా నిర్ణయించారు. ఆ శుభముహూర్తానికి ఇక మూడు రోజులే వ్యవధి! అయినా దేవసేనకా మూడురోజులు, ఒక్కొక్క తిథి ఒక్కొక్క కల్పంగా ఎంతో మందకొడిగా కాళ్ళీడ్చుకుంటు గడిచిపోతున్నట్లనిపించాయి.

దేవసేన జాల్వారు సంస్థానాధీశుని మొదటి కుమార్తె. జసల్మియర్ సంస్థానాధీశులు, జాల్వారు ప్రభువులు కొంచెం దగ్గరబంధువులు. దేవసేనకు, విక్రమసింహుడు వరసకు మేనమామ కుమారుడు. అందుచేత విక్రమసింహుడామె కేమీ కొత్తకాదు. పసితనంలో వారిద్దరు చాలాకాలం కలిసి మెలిసి ఆడుకొన్నారు. ఈడూ, జోడూ చూచిన రాజబంధువులు అప్పుడే వారిద్దరు అన్ని విధాల అనురూపులయిన వధూవరులని నిర్ణయించారు. దేవసేనా విక్రమసింహులు యుక్తవయస్కులు కాగానే యథావిధిగా వివాహమే నిర్ణయించారు.

జసల్ మియర్, జాల్వారు రెండు మార్వారు రాజ్యానికి లోబడిన చిన్న చిన్న సామంతరాజ్యాలు. ఆ రాజ్యాధీశు లిద్దరు ఆ రోజుల్లో మార్వారు, మేవారు రాజ్యాల మధ్య జరిగిన పెద్ద పెద్ద యుద్ధాలలో అనేక మారులు మార్వారు రాజ్యాధీశునికి పెట్టని కోటలుగా నిలబడ్డారు. ఇంకా అతని కనేక విధాలుగా సాయపడ్డారు.

అందుచేతనే మేవారు రాజ్యాధిపతి కుంభరాణాకు మొట్టమొదటినించీ జాల్వారు, జసల్మియరు రాజ్యాలంటే అరికాలిమంట నెత్తికెక్కేది. వారిద్దరూ వియ్యమంది బాగా బలపడుతున్నారన్న వార్త వినగానే అతడు మరింత మండిపడ్డాడు.

వివాహవార్త విన్న మరునాడే జాల్వారు రాజ్యాధిపతి సమక్షాని కొక దూతను పంపించాడు. దేవసేనను తన కిచ్చి వివాహం చెయ్యవలసిందనీ, ఆ విధంగా తమ ఉభయరాజ్యాల మైత్రీ బాంధవ్యాలకు మాంగళ్యదోహదం కలిగించవలసిందనీ ప్రార్థించాడు.

జాల్వారు రాజ్యాధిపతి అప్పటికప్పుడే కుమార్తె దేవసేన వివాహానికి కావలసిన సంభారాలన్నీ సమాయత్త పరుచుకొన్నాడు. కుంభరాణా సందేశం అందిన మరునాటి రాత్రే వివాహ సుముహూర్తం!

ఆ పరిస్థితులలో అతడేటు నిర్ణయించలేక ఎంతో భయపడ్డాడు. కుంభరాణా బండకొనమడు! అతని సందేశం తిరస్కరిస్తే ఏక్షణంలోనైనా అతడు సైన్యంతో సహా జాల్వారు రాజ్యం మీదికి విరుచుకు పడవచ్చును! పోనీ అనుకొని కుంభరాణాకే కన్యనిస్తే ఇరుగు పొరుగు సామంతరాజ్యం జసల్ మియర్‌తో ఎడతెగని యావజ్జీవం వైరం ఏర్పడవచ్చును!

అదీగాక, జసల్ మియర్ యువరాజూ, కుమార్తె చిన్నప్పటినించీ ఎంతో ఆప్యాయంగా కలిసి మెలిసి ఉన్నారనీ, అనుక్షణము ఒకరొకరికోసం ఎంతైనా ఉవ్విళ్లూరుతున్నారనీ అతడెరుగును! కుమార్తెను కుంభరాణా కీయడానికంగీకరిస్తే దేవసేన వినువెంటనే ఎలాంటి అఘాయిత్యానికైనా ఒడిగట్టవచ్చును! ఆ రోజులలో క్షత్రియ మహిళలకేమాత్రం ఆత్మగౌరవహాని సూచన కనిపించినా వెంటనే అగ్నిహోత్రజ్వాలలో ఆత్మాహుతికి సిద్ధపడేవారు.

జాల్వారు రాజ్యాధిపతి కళ్ళకెదురుగా అటువంటి ఆత్మాహుతులెన్నెన్నో జరిగిపోయాయి. పైగా ఒకరొకరిమీద ప్రాణాలు పెట్టుకొని క్షణక్షణము శుభముహూర్తం కోసం నిరీక్షిస్తున్న వధూవరుల కావిధంగా తీరని ఎడబాటు కలిగించడానికతనికి బొత్తిగా మనస్కరించలేదు. కొంతసేపటివరకు రాజమంత్రులలోనే కుతకుతలాడిన ఆ మథన క్రమక్రమంగా అంతఃపురంలో కూడా ఒక పెద్ద ఆందోళనజ్వాల రేకెత్తించింది.

దేవసేనకా దుర్వార్త ఒక పెద్ద పిడుగులా వినిపించింది. కలకలలాడే ఆమె ముఖం ఒక్కమారుగా వెలవెలబోయింది.

అది చూచిన ఆమె తలిదండ్రులిద్దరికీ గుండె తరుక్కుపోయింది. ఇక ఏమయినా సరే, తన కుమార్తెను విక్రమసింహునికే ఇచ్చి వివాహం చెయ్యాలని జాల్వారు ప్రభువు నిశ్చయించుకొన్నాడు. కుంభరాణా దూతతో అవిషయం నిష్కర్షగా చెప్పివేశాడు. తీరా వివాహ ముహూర్తం నిశ్చయించిన పిమ్మట ఆ విధంగా వివాహసందేశం పంపిండం సుక్షత్రియ రాజన్యులకు తగదనీ అది అందరికీ అగౌరవహేతువని గట్టిగా తూలనాడాడు. కుంభరాణా దూతముఖం ముడుచుకుని వెంటనే తిరిగి వెళ్ళిపోయాడు.

మరునాడు జాల్వారు కోటలో తిరిగి యథాప్రకారంగా వివాహ సన్నాహాలు ప్రారంభమయ్యాయి. జసల్ మియరు రాజు యువరాజుతోసహా వివాహానికి తరలి వచ్చాడు. దేవసేన నూతన వధూవేషంతో కలకలలాడుతూ వివాహవేదిక మీద కూర్చుంది.

రాజపురోహితులు యథావిధిగా విఘ్నేశ్వరపూజ కుపక్రమించారు. అంతలోనే జాల్వారుకోట బురుజులపై భయంకర యుద్ధభేరీధ్వనులు మారుమోగాయి! అందరు మహాప్రళయ మేదో ముంచుకు వచ్చిందని భయపడ్డారు. చివరికనుకున్నంతపనీ జరిగింది.

చిత్తూరు దుర్గాధిపతి కుంభరాణా తన సైన్యాలన్నింటితోను కలిసి ఒక్కుమ్మడిగ

దండెత్తి వచ్చాడని జాల్వారు నగరంలో అంతటా ఒక పెద్ద గగ్గోలు బయలుదేరింది. రాజబంధువులంతా ఆ వివాహ సన్నాహం అంతటితో ఆపివేయించి వెనువెంటనే రణరంగంలోకురికారు. ఇంకొకటి రెండుగడియలలో సమాప్తికావలసిన దేవసేన వివాహం హఠాత్తుగా అంతటితోనే ఆగిపోయింది!

విక్రమసింహుడదంతా చూచి ఒక నిమిషంవరకు అలాగే నిర్ఘాంతపోయాడు. అంతవరకు అలవోకగా తలవంచుకొని క్రీగంటి చూపుతో అతనినొకకంట కనిపెట్టిచూస్తున్న దేవసేన కొంచెం తల పైకెత్తి చూచింది. వారిద్దరికళ్ళు కలుసుకొన్నాయి. ఉత్తరక్షణంలో విక్రమసింహుడు వివాహవేదిక దిగి నిశ్చలదృష్టితో ఒకక్షణకాలం దేవసేనవైపెంతో ఆర్ద్రదృష్టితో చూచాడు. దేవసేన లోలోపలే కుమిలికుమిలి వెక్కివెక్కి ఏడ్చింది. విక్రమసింహుడు ఒరలోని కరవాలం చేజిక్కించుకొని చరచరా నాలుగడుగులు వేశాడు. తిరిగి ఇంకొకమారెంతో ఆత్మీయంగా దేవసేనవైపు చూచాడు. ఏదో చెప్పబోయాడు గాని, ఆ మాట చెప్పకుండానే ఉత్తరక్షణంలో అక్కడినించి కదిలి వెళ్ళిపోయాడు.

దేవసేన కతని చూపుల్లో ఒకే ఒక అర్థం సుస్పష్టంగా స్ఫురించింది.

"దేవసేనా! ప్రపంచంలో మనల నిద్దరికీ ఎవరు ఎడబాటు కలిగించలేరు. మనకేమీ భయం లేదు. ఇది అక్షరాలా యథార్థం. నామాట నమ్ము!"



దేవసేన కాధోరణి చూడగానే కొంచెం ధైర్యం కలిగింది. అంతలో కొంచెం దూరంలో రణభేరి మళ్ళీ హృదయవిదారకంగా మారుమోగింది!

అది వినీ వినగానే దేవసేన కేదో భయం వేసింది. ఆ భయోద్వేగంలో ఆమె ఏవేవో విపత్పరంపర లూహించుకొని మొదలు నరికిన తరువులా అలాగే కూలబడి పోయింది.

## ౨

దేవసేన బాగా తెలివి వచ్చిన తరవాత నాలుగువైపులా బాగా పరిశీలించిచూచింది. ఆమె పరిసరాలన్నీ అత్యద్భుతంగా మారిపోయాయి. కొంతసేపటి కామె కది చిత్తూరులో కుంభరాణా కోట అని స్పష్టపడింది. పరిచారిక లామెకు మిగిలిన కథ కాస్త తెలియజేశారు.

యుద్ధంలో జసల్మియర్, జాల్వారు ప్రభువు లిద్దరు పూర్తిగా ఓడిపోయారు. కుంభరాణా చేతిలో దేవసేన ఒక బందీగా పట్టుబడింది. ఇక మిగిలిన విషయాలు పరిచారికలెవరూ స్పష్టంగా చెప్పలేక పోయారు.

అలాగలాగ రెండుమూడుమాసాలు గడిచిపోయాయి. కుంభరాణా అంతఃపురంలో ప్రవేశించి నప్పటినించీ దేవసేన మూర్తీభవించిన శోకదేవతే అయిపోయింది. మొట్టమొదట కొన్నాళ్ళవరకు ఆమె అన్నపానాలే ముట్టలేదు.

కాని క్రమక్రమంగా దేవసేనలో వచ్చిన మార్పు చూచి అంతఃపుర పరిచారికలే తమ కన్నులే నమ్మలేక పోయారు. ఇంకొక నెలరోజులు గడిచిపోయేసరికి ఆమె అందరితోను కలిసి మెలిసి తిరుగుతూ కలకలా నవ్వడం మొదలుపెట్టింది.

ఈ విచిత్ర పరిణామానికి కారణమేమో ఎవ్వరికీ తెలియలేదు. ప్రతినిత్యము భవానీ పూజచేసి అఖండ దీపారాధన చెయ్యడం ఆమెకొక అలవాటయింది. దేవసేనలో ఇటీవల కలిగిన ఆ హఠాత్పరిణామానికదే ఒక ముఖ్యకారణమై ఉండవచ్చునని పరిచారికలు కొందరు నిశ్చయించారు.

దేవసేన నిత్యము దీపదీపాల వేళ చిత్తూరు కోట బురుజుపై నిలిచి ఆకాశం చుంబించే భవానీదేవాలయానికి వెళ్ళి కొంచెంసేపు పూజాపురస్కారాలు చేసి తన ప్రాసాదానికి తిరిగి వెళ్ళిపోతూంటుంది. ఈనాడామె దేవిసన్నిధిని మోకరిల్లి ఆనందపరవశముఖంతో లేచి నిలబడింది. దేవతామూర్తి పార్శ్వంలో నిలిచిన సుందరీ శిల్పాంజలిలో వెలిగే అఖండ దీపికలో కొన్ని కర్పూర ఖండాలర్పించింది. అరమోడ్పుకన్నుగవతో ఆ దేవి కత్యంత భక్తిభావంతో నమస్కరించింది. అంతలో అంతఃపురపరిచారిక నిర్మల అక్కడికివచ్చి ఆమెకు నమస్కరించింది.

"అమ్మా! వారు వస్తున్నారు! జాగ్రత్త!

గుసగుసలాడుకొన్న సవ్వడికూడా వినబడకూడదు."

పరిచారిక వెంటనే వెళ్ళిపోయింది. అంతలో ఇంకొక పరిచారిక అక్కడ ప్రత్యక్షమయింది. కాని ఆమె పరిచారిక కాదనీ, పరిచారికా వేషంతో విక్రమసింహుడే అత్యంతనిగూఢంగా ఆ అంతఃపురంలో ప్రవేశించాడనీ ఆమెకు ఎంతకు పూర్వమే తెలిసింది. అతడు లోపలికి రాగానే దేవసేన కళ్లారా అతనివైపు ఒకమారు చూచింది. మరుక్షణంలో భరించరానిశోకావేశంతో నేలపైకూలబడిపోయింది. విక్రమసింహుడామెను తనఒడిలో కూర్చోపెట్టుకున్నాడు. ఆమె నేత్రాలు రెండు అప్రయత్నంగా మూసుకొన్నాయి. ముకుళించిన నేత్రాంతాలనుండి కన్నీరుమున్నీరై ప్రవహించింది. అంతటి మహానందసమయంలో ఆమె అవిధంగా దుఃఖించడానికి కారణమేమీ అతనికి బోధపడలేదు. విక్రమసేనుడు మృదువుగా ఆమె కనురెప్పలు ముద్దుపెట్టుకొన్నాడు:

"దేవసేనా! నీ వెందుకిలాగ విచారిస్తున్నావు? కారణమేమిటి కొంచెం నాతో చెప్పగూడదా?"

దేవసేన మళ్లీ వలవలా వాపోయింది:

"రాణాకు, నాకు ఇంతకు పూర్వమే వివాహం అయిపోయింది. ఏమి చెయ్యను! నా నొసట రాసినరాత ఇంతే!"

దేవసేన మళ్లీ కుమిలి కుమిలి ఏడ్చింది. కాని విక్రమసేను డెక్కడా చెక్కు చెదరలేదు. పైగా పకపకా నవ్వాడు:

"నీవింతటి వెర్రిదానవని అనుకోలేదు! దైవసాక్షిగా, మన ఇద్దరి వివాహము ఇంతకు పూర్వమే జరిగిపోయింది! ఆపైన కుంభరాణా నిన్నెంత వేదోక్తంగా వివాహమాడినా అది నిజమైన వివాహం కాజాలదు! అతడు చేసినది క్షత్రియధర్మానికి కేవలం వ్యతిరేకం! దానికి తగిన ఫలితం అతడు త్వరలోనే అనుభవించితీరతాడు! నా మాట నమ్ము!"

ఆమాటలువిని ఆమె కొంచెంకుదటపడింది:

"మీరింతమంది అంతఃపుర పరిచారికల కళ్లు గప్పి ఇక్కడి కెలాగరాగలిగారు?"

విస్ఫారిత నేత్రాలతో ఆమె అలాగే ఆశ్చర్యపోయింది. విక్రమసేనుడా కథ అంతా సంగ్రహంగా ఆమెకు తెలియజేశాడు.

"రాణా నిన్నపహరించుకొని పోగానే నేను చేతులు ముడుచుకొని మాట్లాడకూరుకొన్నా ననుకొన్నావా? అప్పటినించీ నేనీ చిత్తూరు నగరంలో మారువేషంతో తిరుగుతూనే ఉన్నాను. క్రమంగా అంతఃపుర పరిచారిక నిర్మలతో పరిచయం కలిగించుకొన్నాను. ఆమెకెల్లో ఎంతైనా ధనం సమర్పించాను. నాకీ పరిచారికావేషం ఆమె మూలంగానే లభించింది. ఆమె అనుక్షణము నాకీ కోట అనుపానులన్నీ చెబుతూనే ఉంది! అయితే ఈవేళే నేనిక్కడికి రావడానికి కొంచెం అదును దొరికింది. ఏమి చెయ్యను! ఎంత ప్రయత్నించినా ఇంతకు పూర్వం అది సాధ్యపడలేదు!"

విక్రమసింహు డొక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. దేవసేన అతన్ని గాఢంగా కౌగలించుకుంది:

"ఇక ఎన్నాళ్లు నాకీ చెర! నన్నెప్పుడీ


# మెరయుచు పొంగే ఈనో

# కడుపులోని అస్వస్థతలను ఎనిమిది సెకెండ్లలో పోగొట్టును!



అజీర్ణము, గుండెమంట లేక కడుపు ఉబ్బరం, ఏదయినా దీనితో ఉపశమనము కలుగును!

ఒక గ్లాసెడు మెరయుచు పొంగే ఈనో ఫ్రూట్ సాల్ట్ మీరు పుచ్చుకుంటే ఎనిమిది సెకెండ్లలో మీ కడుపులోని అస్వస్థత నయమగును. మీరు పరకడుపున కొంచెము ఎక్కువ మోతాదు త్రాగుతే, ఈనో సౌమ్యముగ, నిశ్చయమైన గుణము కలిగించే విరేచనముల మందుగా పనిచేయును. ఎల్లప్పుడూ ఈనో ఒక సీసా మీ యింట్లో ఉంచుకోండి.

## ఈనో 'ఫ్రూట్ సాల్ట్'

అమ్ల నిరోధకమైన మెరయుచు పొంగే పానీయము

'ఈనో' మరియు 'ఫ్రూట్ సాల్ట్' అను మాటలు రిజిస్టరు చేయబడిన ట్రేడు మార్కులు

ఈనో ఈ శీతోష్ణస్థితికి నిజంగా దివ్యమైనది




(2 సైజుల సీసాలలో అమ్మబడుచున్నది)

చెరనుండి విడిపిస్తారు !"

"ఎన్నో నాళ్లా! మళ్లీ పున్నమనాటికి నీవు జనల్ మియారుకోటలో ఉంటావు! ఇది ముమ్మాటికీ నిజం! నీవేమీ భయపడ నక్కరలేదు! తెలిసిందా ?"

దేవసేన పైనున్న పున్నమిచంద్రునివైపొక మారు చూచింది:

"అంతవరకు సప్తర్షులకేసీ, ఆఅరుంధతికేసీ మరొకసారు చూస్తూఉండండి! నేనా నక్షత్రాలకేసి చూచి సాక్షాత్తుగా మిమ్మల్ని చూచినట్లే ఆనందిస్తాను.

"అమ్మవారిసన్నిధిని నేనిలాగే అఖండదీపం వెలిగిస్తూంటాను. మీరా కొండశిఖరంమీద నిలబడితే నేను కనిపించకపోయినా ఈ చిన్నదీపమైనా కనిపించి తీరుతుంది! మీరు తిరిగి వచ్చేవరకు ఈ రెండుకోరికలు మాత్రం తప్పక చెల్లించండి!"

దేవసేనకంఠం.గద్గదభారంతో వణికింది. ఆమె మరి మాట్లాడలేక పోయింది.

అంతలో వారి కనతిదూరంలో నిలబడిన నిర్మల తొందర తొందరగా అక్కడికి వచ్చింది:

"అమ్మా! లేవండి! ఎవరో మిమ్మల్ని వెతుక్కుంటూ ఇక్కడికే వస్తున్నట్లున్నారు!"

దేవసేన అప్పటికి బాగా వేళమించిపోయినదని గ్రహించింది. తటాలున లేచి నిలబడింది:

"తొందర తొందరగా తిరిగివెళ్ళండి! నామాట మరిచిపోకండి! మీ కోసం నేనిలాగే వేయికళ్లతో కనిపెట్టుకుని చూస్తూంటాను! తిరిగి ఇక్కడికెప్పుడు వస్తారు?"

అతడలాగే ఆమెకేసి చూస్తూనిలబడ్డాడు. అంతలో ఆమె ఒక సంజ్ఞ చేసింది. విక్రమసేను దది గ్రహించాడు. దేవసేనా విక్రమసింహూ లిద్దరు భవానీదేవి పాదాలపై వాలిపోయారు. మరుక్షణంలోనే విక్రమసింహుడు కోటబురుజుల మాటునపడి అదృశ్యుడయ్యాడు. దేవసేన కనిపించినంతవరకు అత్యంతనిశ్చలదృష్టితో అతనివైపు చూచింది.

ఆపైన భవానిదేవి పాదాలపై కూలబడిపోయింది.

## 3

అటుపిమ్మట దేవసేన ప్రతి దినము భవానీదేవత పాదసన్నిధానంలో అఖండ దీపిక వెలిగించి సప్తర్షి మండలమైపే కాంగ్రదృష్టితో చూచింది.

ఆ క్షణంలో ఆమె విక్రమసింహుని కళ్లారా చూచినట్లే ఆనందించింది. అప్పటి నించి ఆ నిరీక్షణమే ఆమె కొక నిత్యోత్సవమయింది!

ఆ విధంగా ఒక పది పదిహేను రోజులు గడిచిపోయాయి. అంతవరకు ఆమెకు నిర్మల ద్వారా విక్రమసేనుని క్షేమవార్తలు, అతని ప్రయత్నాలు అన్ని తెలుస్తూనే ఉన్నాయి.

ఒక నాడెంత సేపటికీ నిర్మల ఆమె దగ్గరికి రాలేదు.

దేవసేన మరి వేచిఉండలేక ఇంకొక పరిచారికను పిలిచి నిర్మల సంగతి గుచ్చి గుచ్చి అడిగింగి. నిర్మలకు దేవిడీమన్నా జరిగిపోయిందనీ ఆమె మరి అంతఃపురంలో అడుగు పెట్టడానికే వీలులేదనీ ఆ పరిచారిక సమాధానం చెప్పింది. దేవసేన ఆమె నెన్నో విధాల గుచ్చి గుచ్చి అడిగింది. కాని ఆమె నిర్మలను గురించి అంతకంటె వేరే విశేషాలేవీ తనకు తెలియవనీ అంతవరకే· తెలిసిందనీ సమాధానం చెప్పింది.

మిగిలిన అంతఃపుర పరిచారిక లెవరో ఒక కొత్త పరిచారిక హఠాత్తుగా అంతఃపురంలో అడుగుపెట్టిన విషయం కొంచెం చూచాయగా అనుమానించి ఉంటారనీ నిర్మలకు దేవిడీమన్నా జరగడానికదే కారణమై ఉండవచ్చుననీ ఇక ఆ విషయంలో గట్టిగా కట్టుదిట్టాలు జరిగి ఉండవచ్చుననీ దేవసేన గ్రహించివేసింది.

అయినా ఆమె తన ఆశ విడిచిపెట్టలేదు! అలాగే ఆ కోట బురుజుపై నిలిచి ఆకాశమే అందుకొనే ఆ భవానీ దేవాలయంలో నిత్యము కర్పూర ఖండాలతో అఖండదీపిక వెలిగించింది. అలాగే ప్రతిదినము సప్తర్షి మండలంవైపు రెప్పవాల్చకుండా చూచింది.

మరి కొన్ని నెలలు గడిచిపోయాయి. కాని విక్రమసింహునిజాడే తెలియ లేదు.

అయినా దేవసేన తనఆశ విడిచిపెట్టలేదు. అలాగలాగ ఇంకొమరికొన్ని నెలలు, సంవత్సరాలుకూడా గడిచిపోయాయి. విక్రమసింహుడు మరి తిరిగిరానేలేదు. అయినా దేవసేన తన ఆశవిడిచిపెట్టలేదు!

క్రమక్రమంగా కొన్ని వందల ఏళ్లు గడిచిపోయాయి. ఆ లనాటి రాజస్థాన వీరులు, వీరమహిళలు చారణులు గొంతెత్తి పాడే యశో గీతికలలో లీనమైపోయారు!

కాని ఆనాడు దేవసేన భవానీదేవి పాద సన్నిధిని వెలిగించిన దీపకళిక ఈ నాటికీ రాజస్థాన వీర గీతికలలో నిలిచి ఒక దివ్య తారకలా తళతళా మెరుస్తూనే ఉంది! ★





# Zam-Buk

జామ్-బక్
చీడను తలపుత్తిపై
వ్యాధులను, గజ్జిని
త్వరలో నివారించును

అమూల్య సుగుణములన్నిటితో గూడిన జామ్-బక్, ప్రపంచంలోకల్లా అత్యుత్తమ చర్మరోగ నివారిణి. జామ్-బక్ రోగపూరిత తంత్రులను శుద్ధపర్చును, వాపును శమనపర్చును మరియు త్వరలో చర్మమును మరల ఆరోగ్యస్థితికి దెచ్చును.

జామ్-బక్ ఇతర చర్మ వ్యాధులన్నిటికిన్ని గాయములకు కూడ అద్భుత నివారిణి.




బంతు గ్రావ్వ దీనిలో కలపలేదని గ్యారంటీ చేయబడినది
అన్ని మందుల షాపులందునూ దొరకును.

సోల్ ఏజెంట్లు: దాదా & కో.
86, నైనప్పనాయక్ వీధి, మద్రాసు-1

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో
వరుసగా ప్రకటింపబడిన
శ్రీ క్రొవ్విడి లక్ష్మన్నగారి
"హనోయ్ విశేషాలు
కాంబోడియాకబుర్లు"
పుస్తక రూపములో వెలువడినది.
వెల రు. 1-13
విశాలాంధ్రప్రచురణాలయం, విజయవాడ-

RATNAM'S 'N' OIL
సేవించిన పూర్తి సంతోష సౌఖ్యము లనుభవించగలరు. 1 సీసా రూ. 11-4-0.
ఎడ్రెస్సుతో జాబు వ్రాయండి.
డాక్టర్. రత్నం సన్స్,
మలకపేట బిల్డింగ్స్, హైదరాబాదు-2.